# అభివృద్ధి పథంలో రామగుండం



(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మేయర్ అనిల్ కుమార్, హాజరైన సభ్యులు

- రూ.100 కోట్లు ఇచ్చిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు
- నగర పాలక మేయర్ అనిల్ కుమార్
- పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని తీర్మానం
- బతుకమ్మ వేడుకలకు రూ.25లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం
- జనగామ పేరు మార్పుపై జోరుగా సాగిన చర్చ

కోల్‌సిటీ, అక్టోబర్ 5: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశంలో రామగుండం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నదని మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువార అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 14వ ఆర్థిక సంఘం పనులకు సంబంధించి బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని సభ్యులు పట్టుబట్టారు. త్వరలో జరుగబోయే బతుకమ్మ వేడుకలకు సంబంధించి రూ.25లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. 4 నెలల వ్యవధిలోనే రెండుసార్లు రామగుండం నగరాన్ని మున్సిపల్ శాఖ మంత్రి సందర్శించడం, నగర అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నగరాన్ని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుంటానని ప్రకటించడంపై ఆయనకు కౌన్సిల్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎజెండాలోని పలు అంశాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. ఎన్నికల నియమావళితో అంతరాయం ఏర్పడకుండా 50 డివిజన్లలో కార్పొరేటర్లు సూ చించిన ప్రకారం చేపట్టాల్సి ఉన్న అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. అభివృద్ధి పనుల టెం డర్లు పొంది పనులు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు తరువాతి టెండర్లలో పాల్గొనకుండా అనర్హత విధించాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు. నగర పాలక సంస్థ పేరును రామగుండం జనగామ మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చడంపై సభ్యులు ప్రతిపాదించగా చాలా సేపు చర్చ జరిగింది. ఈ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని కొందరు కార్పొరేటర్లు, సున్నితమైన అంశం కావడంతో చర్చించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మరికొందరు, స్థానికుల ఆధార్ కార్డులు, ఓటరు కార్డుల్లో మార్పులు అవసరం ఏర్పడుతాయేమోనని మరికొందరు కార్పొరేటర్లు సంశయం వ్యక్తం చేశారు. రామగుండం పేరు తొలగించడం లేదని, ఐతే రామగుండంతో పాటు జనగామ పేరు బ్రాకెట్‌లో జత చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని 8,9వ డివిజన్ల కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, జనగామ కవిత వివరణ ఇచ్చారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడం నగర పాలక సంస్థ పరిధిలో ఉండదని మేయర్ సమాధానమిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల ద్వారా మంత్రి దృష్టికి తీసుకవెళ్లి ఏకాభిప్రాయంతో చర్య తీసుకుందామని మేయర్ చెప్పారు. రానున్న సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా అద్దె ప్రాతిపదికన ఆయా డివిజన్లలో ఎల్ఈడీ లైట్లు, సిరీస్ బల్బులు ఏర్పాటు చేయడానికి రూ.25లక్షలు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ అభిషేక్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ నాగేశ్వర్, ఎస్ఈ చిన్నారావు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ

## ప్రజలకు సేవలందించేందుకు పుట్ట లింగమ్మ ట్రస్టు

మంథని, అక్టోబర్ 5: మంథనిలోని కళాశాల మైదానంలో పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన మంథనిలోని ప్రజలకు సేవలు అందించాలనే సంకల్పంతో పుట్ట లింగమ్మ ట్రస్టును ఏర్పాటు చేశామని తెలిపారు. డాక్టర్ రావుస్ హాస్పిటల్, రెనె ఆసుపత్రి, రజిని దవాఖాన సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు వివరించారు. ఈ శిబిరంలో దాదాపు 2వేల మందికి పరీక్షలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, సీనియర్ నాయకుడు కర్రు నాగయ్య, యువ నాయకుడు పుట్ట శ్రీహర్ష్, కౌన్సిలర్లు వీకే రవి, శ్రీపతి బానయ్య, నక్క నాగేంద్ర, డాక్టర్లు పాల్గొన్నారు

## నాగారంలో గీత కార్మికుడికి గాయాలు

మంథని రూరల్, అక్టోబర్ 5: నాగారం గ్రామానికి కోండ్ర సతీష్ గౌడ్ తాడి చెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోజులాగే గురువారం తాడి చెట్టు ఎక్కుతుండగా కాలు జారి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.వెన్నెముక దెబ్బతిన్నదని తెలిపారు. ప్రభుత్వ పరంగా సాయం అందిచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మోడ్రన్ ఫ్రూట్ మార్కెట్‌కు శంకుస్థాపన

### పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



27 వ డివిజన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే కోరుకుంటి చందర్

గోదావరిఖని, అక్టోబర్ 5: గోదావరిఖనిలోని 27వ డివిజన్‌లో రూ.10లక్షలతో చేపట్టనున్న మోడ్రన్ ఫ్రూట్ మార్కెట్‌కు గురువారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోడ్రన్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణంతో పండ్ల వ్యాపారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. దశాబ్ది ప్రగతి సభలో మంత్రి కేటీఆర్ నియోజక వర్గాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారని, రామగుండం త్వరలోనే సిద్దిపేట తరహాలో మారబోతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్ కల్వాల శిరీష, కౌశిక హరి ఉన్నారు.

**సమాజ హితులు పాత్రికేయులు**

సమాజ హితులు పాత్రికేయులని, గోదావరిఖని ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందించామని రామగుండం నియోజక వర్గం జర్నలిస్టులకు త్వరలోనే ఇండ్ల స్థలాలు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు.గోదావరిఖని ప్రెస్‌క్లబ్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉద్యమకారులకు ఉద్యమానికి, తమకు అండగా ప్రెస్‌క్లబ్ నిలిచిందన్నారు.ప్రెస్ క్లబ్‌కు మరో రూ.30లక్షలు అందిస్తామని చెప్పారు. త్వరలోనే ఇండ్ల స్థలాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వంశీ, ప్రధానకార్యదర్శి పూదరి కుమార్, దయానంద్ గాంధీ, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, జడ్పీటీసీ ఆముల నారాయణ, నాయకులు కౌశిక హరి, కార్పొరేటర్ ఇంజపురి పులెందర్, జర్నలిస్టులు ఉన్నారు.

## ఖాదీ మేళా ప్రారంభం

యైటింక్లయిన్ కాలనీ,అక్టోబర్ 5 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో వావివాల ఖాదీ గ్రామోద్యోగ్ మేళాను ఏరియా ఎస్‌వోటుజీఎం అబ్దుల్ సలీం గురువారం ప్రారంభించారు. డీజీఎం (ప) జీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి మేళాను ప్రారంభించారు. ఈ నెల2 నుండి 11 వరకు భారీ తగ్గింపు ధరల్లో ఖాధీ వస్త్రాల మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కార్మికులు, కార్మిక కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి హమీద్, ఖాదీ మేనేజర్ చంద్రమౌళి, సతీష్, రాజ్ కుమార్‌లు పాల్గొన్నారు.

## బాపూజీ మార్గ్‌గా నామకరణం చేయాలి

కోల్‌సిటీ, అక్టోబర్ 5: గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీ ప్రధాన రోడ్డుకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గ్‌గా నామకరణం చేస్తూ కౌన్సిల్ ఆమోదించాలని పద్మశాలీ సేవా సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్ నాగేశ్వర్‌తో పాటు కార్పొరేటర్లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో రామగుండం శాసన సభ్యులు కోరుకంటి చందర్ కూడా మార్కండేయ కాలనీ రోడ్డుకు బాపూజీ మార్గ్‌గా నామకరణం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే బాపూజీ విగ్రహ ప్రాంగణం సమీపంలోని చౌరస్తాకు ఆచార్య కొండ లక్ష్మణ్ చౌరస్తాగా నామకరణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి రాజమల్లు, బూర్ల దామోదర్, సంఘం పెద్దలు ఉన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

రామగిరి, అక్టోబర్ 5: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో ప్రగతి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్ మాట్లాడారు. ప్రపంచంలో ఎన్ని వృత్తులు ఉన్నా వారందరినీ తయారు చేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు కేశవరెడ్డి, శ్రీనివాస్, మేకల మారుతి పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్



కోల్ సిటీ : 48వ డివిజన్‌లో చీరెలు అందజేస్తున్న కార్పొరేటర్, కో-ఆప్షన్ సభ్యురాలు

కోల్‌సిటీ, అక్టోబర్ 5: సీఎంకేసీఆర్ ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారని కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బతుకమ్మ చీరెల పంపిణీ రామగుండం బల్దియాలో గురువారం ప్రారంభించారు. 48వ డివిజన్‌లో కార్పొరేటర్ పొన్నం విద్య, కో-ఆప్షన్ సభ్యురాలు తానిపర్తి విజయలక్ష్మి గోపాల్ రావుమహిళలకు చీరెలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మొత్తం 59,630 బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**ముత్తారం మండలంలో..**

మంథని రూరల్(ముత్తారం),అక్టోబర్ 5: ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో జడ్పీటీసీ చెలుకల స్వర్ణలత అశోక్, మచ్చుపేటలో సర్పంచ్ మేగోడని సతీశ్ గౌడ్ బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నెత్తెట్ల మహేందర్, ఎంపీటీసీ బియ్యాని శ్యామల సదానందం ఉన్నారు.

# బాధిత కుటుంబానికి రూ. లక్ష సాయం



డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 5: రామగుండం ప్రాజెక్టు న్యూ కార్యాలయంలో యూడీసీగా పని చేసే తాళ్ల సురేశ్ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి అంగన్‌వాడీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(టీఈఎన్‌జీవో) రూ. లక్ష ఫిక్సిడ్ డిపాజిట్ గురువారం అందించారు. ఈ మేరకు గురువారం అసోసియేషన్ నాయకులు సురేశ్ భార్య దివ్య, పిల్లలు శార్వాణి, శివానంద్‌రామ్‌కు ఫిక్సడ్ డిపాజిట్ పత్రాన్ని అందజేశారు. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎన్ స్వర్ణలత, ప్రధానకార్యదర్శి ఆర్ శారద, ఉపాధ్యాక్షులు విశ్రాజ్ నౌషిన్, వకుల, ఎం తిరుమల, సబిత, రాజేశ్వరి, జయసుధ, కే భాగ్యలక్ష్మి, కే సుజాత, పుష్ప, వహీం, సాహిం, రాజేశ్వరి, రజిత, కే రమణ ఉన్నారు.

## గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ

ధర్మారం,అక్టోబర్5: పైడిచింతలపల్లి గ్రామంలో మహిళా గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి నందిమేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ భవన నిర్మాణం కోసం మంత్రి కొప్పుల ఈశ్వర్ డీఎంఎఫ్టీ ద్వారా రూ.5 లక్షలు కేటాయించారు. దీంతో బలరాంరెడ్డి కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రాజశేఖర్,గ్రామ ఇన్‌చార్జి చొప్పరి స్వరూప-కుమార్,వార్డు సభ్యుడు రుద్ర కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.